ప్రజాశక్తి
శనివారం 18 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని ఆరోపిస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం జర్నలిస్టులు నిరసన చేపట్టారు. పాత బస్ స్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం పాడేరు డిఎస్పి సహబాజ్ అహ్మద్ కు వినతి పత్రం అందించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు కొండబాబు, దుర్గా, సునీల్, మహేష్, ప్రేమ్, శ్రీను, గిరి, భాస్కర్, వెంకట్ రాజ్, పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు

మాట్లాడుతున్న సురేంద్ర, అప్పలనరస, గంగరాజు, తదితరులు

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేయాలని..

24న చలో కలెక్టరేట్

- సమగ్ర కమిటీ పేరిట సర్వే చేస్తే గిరిజనులంతా అడ్డుకుంటాం
- ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, అరకువేలి, హుకుంపేట, చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం బడా కార్పొరేట్ నవయుగ, అదాని, శిరిడి సాయి ఎలక్ట్రికల్, మెగా కంపెనీలతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై జారీ చేసిన జీవో నెంబర్ 13 ,51 ,2 రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ వెల్లడించింది. ఆదివాసీ హక్కులు, చట్టాలు ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర కమిటీ పేరుతో సర్వేలు చేపడితే ఆదివాసులు ముఖ్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. ఈనెల 24 న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పాడేరుకు వేలాదిగా ఆదివాసులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది.

ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రజా ప్రతినిధుల బృందం శుక్రవారం పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీ పూజాతో చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, అనంతగిరి జడ్పీటీసీ డి గంగరాజు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కో కన్వీనర్లు సురేష్ కుమార్, దశరథ్, కొండలరావు, స్వామి, నరసింగరావు మాట్లాడుతూ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తాత్కాలికంగా పనులు నిలిపివేత అంటూ ఆదివాసులకు మాయమాటలు చెప్పి మోసగిస్తున్నారని, పనులు నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర కేబినెట్ లో చర్చించారా లేదా గిరిజన సలహా మండలిలో చర్చ జరిగిందా? పాడేరు ఐటిడిఏ పాలకవర్గంలో చర్చ జరిగిందా? ఎక్కడ నిర్ణయం తీసుకున్నారని ప్రభుత్వ చట్టబద్ధ వేదికల్లో చర్చించకుండా తాత్కాలిక పనులు నిలిపివేత అంటూ ఆదివాసులకు మోసం చేయడమేనని అన్నారు. మంత్రి ప్రకటన శిరోధార్యం అంటూ జిల్లా అధికార యంత్రాంగం గ్రామాల్లో అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని అన్నారు. మంత్రి ప్రకటన వారం తర్వాత సీలేరులో బడా కార్పొరేట్ మెగా కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూమి పూజ చేసిందని గ్రామాల్లో డ్రోన్ లతో నిఘా పెంచి ఆదివాసులకు భయ భ్రాంతులను గురి చేస్తున్నారని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు జారీ చేసిన జీవోలు రద్దు చేయాలని గత రెండు నెలల నుంచి ఆదివాసులు ఆందోళన పోరాట కార్యక్రమం నిర్వహిస్తుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. గతనెలలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నవయుగ బడా కంపెనీకి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సామర్థ్యం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ నవయుగ అదాని శిరిడి సాయి ఎలక్ట్రికల్ మెగా కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని, జీవో నెంబర్ 13 ,51, 2 రద్దు చేయాలని లేని పక్షంలో ఈనెల 24వ తేదీన చలో కలెక్టరేట్ పాడేరు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం సమగ్ర ప్రణాళిక కమిటీతో సర్వే నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కృష్ణారావు, బుజ్జిబాబు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బొంజి బాబు, బుజ్జి బాబు, రామారావు, సింహాద్రి, సుందర్ రావు, ఆనందరావు, పరశురాం, అప్పన్న, మాజీ ఎంపిటిసి మోహన్ రావు, సన్యాసిరావు, రాంచందర్, నాగేష్, విజయ్ కాంగు చిన్ని పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా కలెక్టర్‌కు అవార్డు

ప్రజాశక్తి పాడేరు, : ప్రజా సేవలో అంకితభావం, పరిపాలనలో పారదర్శకత, ఆవిష్కరణాత్మక కార్యక్రమాల అమలు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ కి విశిష్ట గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేయబడే అధికార కర్మయోగి ఉత్తమ ప్రదర్శన అవార్డ్‌కి ఎంపిక కావడం గర్వకారణం. జిల్లా పరిపాలనలో పలు విభాగాల్లో దినేష్ కుమార్ చేపట్టిన వినూత్న చర్యలు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో పాలన, విద్యా-ఆరోగ్య రంగాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, పౌరసౌకర్యాల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చూపిన కృషి ప్రశంసనీయమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.

సమస్యలు పరిష్కరించకపోతే మెరుపు సమ్మె

- విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల హెచ్చరిక
- పలుచోట్ల ఆందోళనలు

పాడేరు డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

సీలేరు ఎపి జెన్కో ఎస్ఇ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యం సానుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే మెరుపు సమ్మెకి దిగుతామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (హెచ్ 176 సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణ్ టి.విష్ణుకుమార్ హెచ్చరించారు. జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్కో ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని యాజమాన్యం మొండివైఖరి నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎపి పవర్ జెఎసి నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 15న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె వాయిదా వేసి చర్చలకు రావాలని యాజమాన్యం పిలవడంతో తమ నాయకులు సమ్మె తాత్కాలికంగా నిలిపి వేశామన్నారు. ఈనెల 17న ఎపి పవర్ జేఏసీ నాయకులతో చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో సమస్యలు పరిష్కారానికి శాంతియుతంగా చర్చలు జరుగుతు న్నాయన్నారు. చర్చల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎపి జెన్‌కో డిస్కం సంస్థల్లో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులు మూకుమ్మడిగా సమ్మె బాట పడతామని హెచ్చరించారు. వివిధ సంస్థల్లో 10 సంవత్సరాలకు పైగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరినీ అన్‌లిమిటెడ్ వైద్యసౌకర్యం కోటి రూపాయల బీమా పథకం రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపకార్యదర్శి జి.లక్ష్మణరావు ఉపాధ్యక్షుడు ఎస్.రమణ, కాంట్రాక్ట్ కార్మికులు, ఎపి జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెంలో ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రేమ్ సన్ బ్రాంచ్ సెక్రటరీ వేపకాయల శ్రీను, సిఐటియు నాయకులు దేముడు, కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు రాజేష్ గంగయ్య మహేష్ పాల్గొన్నారు.

పాడేరు: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఇపిడిసిఎల్ పాడేరు డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం, పలు డిమాండ్ల పరిష్కారానికై డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. నేరుగా వేతనాలు చెల్లించడంతో సంస్థకు 192 కోట్లు మిగులుతాయని , వేతన వ్యత్యాసాలను సవరించవచ్చునని, పీస్ రెట్ వర్కర్లకు కనీస వేతనం చెల్లించవచ్చునన్నారు. దీంతో సంస్థకు కూడా ప్రయోజనమే నన్నారు గ్రేడ్ టు సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింప చేయడానికి వచ్చే ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. పెన్షన్ బిక్ష కాదని, కార్మిక ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు.సంస్కరణల పేరుతో ఇష్టానుసారంగా జేఎల్ఎం గ్రేడ్ 2లని, డేటా ఎంట్రీ ఆపరేటర్లని, రకరకాల పేర్లు, రకరకాల స్కేలుల్లో యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ప్రైవేటీకరణలో భాగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, రాజు, చైతన్య, ప్రసాద్, పడాల్, దామోదర్, డేవిడ్, విజయ్, బుల్లిబాబు, హరికష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సృష్టించుకోవాలి

శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కొయ్యూరు: పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సృష్టించుకుంటే స్వయం పాలన, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాబూరావు, ఎఒ బాలమురళీకృష్ణతో కలిసి సర్పంచ్‌లు, కార్యదర్శులకు మొదటిరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీలకు చెందిన ఆస్తులను గుర్తించి ఆర్థిక వనరులుగా మలుచుకోవాలని సూచించారు.

వీధి లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి-కూనవరం: స్థానిక కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ ముల్లూరు గ్రామంలో పర్యటించారు. పంచాయతీ వ్యాప్తంగా తాగు నీటిని పరిశీలించి, సమయపాలనతో ఇచ్చే నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముల్లూరు గ్రామంలో స్థానిక లైన్‌మెన్ శివ సహకారంతో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. పంచాయతీలో సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, ఉమ్మడి కార్యాచరణతో పరిష్కరిద్దామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో తులసిపాక పరిసర ప్రాంతాల్లో , నది ఒడ్డున కుళ్ళిన స్థితిలో మతదేహం లభ్యమైంది. మోతుగూడెం ఎస్ఐ చరణ్‌నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని గ్యాస్ గోడౌన్, రూడ కోట బూసి పుట్టు ప్రాంతాల వెళ్లే మార్గాన్న ఉన్న చెత్తాచెదారాన్ని శుక్రవారం తొలగించారు.ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో డంపింగ్ యార్డ్ తో దుర్గంధం పేరుతో వచ్చిన కథనానికి మండల అభివృద్ధి శాఖ అధికారి కే ధర్మారావు స్పందించారు. శుక్రవారం డంపింగ్ యార్డ్ లోని చెత్తాచెదారాన్ని హెడ్ క్వార్టర్ పంచాయతీ సెక్రెటరీ సింహాచలం ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో చెత్తాచెదారాన్ని తొలగించారు.

తొలగిస్తున్న సెక్రటరీ

'ఏకలవ్య'లో సమస్యలపై ఆరా

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోనీ జోలపుట్టు గ్రామ పంచాయతీ లబ్బూరు గ్రామ సమీపంలోని ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో మౌలిక సదుపాయాలు లేవని, తరచూ వస్తున్న వార్త కథనాలతో పాటు, గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండల అభివృద్ధి శాఖ అధికారి కే ధర్మారావు సమస్యల పరిశీలనకు శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటేషన్ ఇంజనీర్ గంగాధర్‌తో కలిసి వచ్చి పరిశీలించారు. ఏకలవ్య ప్రిన్సిపల్ సుమన్‌ను పాఠశాలలో సమస్యలపై అడిగి ఆరా తీశారు అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, తగినంత నీరు అందకపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడిందని తెలిపారు.ఏకలవ్య భవనాల నిర్మాణాలు ముందే బోరు బావి తవ్వించుంటే సమస్యలు తలెత్తవి కాదన్నారు. ఏకలవ్య పాఠశాలలో రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, నైట్ వాచ్మెన్, డార్మెంటరీ భవనాలు, అర్ధాంతంగా నిలిచిపోయిన నిర్మాణ పనులు త్వరితగతన ప్రారంభించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే విధంగా నివేదిక పంపుతామని తెలిపారు. ఏకలవ్య పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ రామదాస్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పనలో ఉన్నత అధికారులు చొరవ చూపాలన్నారు.

కుండీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎం హెచ్ఒ

డిఎంహెచ్ఒ నాయక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: జిల్లా నూతన వైద్యా ఆరోగ్యశాఖాధికారిగా డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్ శుక్రవారం ఐటిడిఎలోని వైద్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత డిఎంహెచ్ఒ జమాల్ భాషా ఈ ఏడాది మార్చిలో కడప బదిలీ కాగా, అప్పటి నుంచి జిల్లా అంధత్వ నివారణ సంస్థ డిపిఎం టి.విశ్వేశ్వర నాయుడు ఎఫ్ఎసి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్ గా పనిచేస్తూ పదోన్నతి పొంది అల్లూరి జిల్లాలో డిఎంహెచ్ఒగా కృష్ణమూర్తి నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు డాక్టర్లు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో విద్యార్థి నిలకు అరకులోయ సిఐ హిమగిరి శుక్రవారం నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాల కు ఎవరు కూడా మోసపోవద్దని సూచించారు. సైబర్ నెరగాళ్లు అనేక లింకులు పెట్టి పంపిస్తుంటారని,చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అలాంటి లింకులపై క్లిక్ చేయవద్దన్నారు.ఈ సైబర్ నేరాల గురించి మీ తల్లిదండ్రులకు,మీ బంధువులకు కూడా తెలియజేయలన్నారు.అలాగే విద్యార్థులు ఎవరు ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష సాధనను ఏర్పరచుకొని ఆ లక్ష్యసాధనకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. అదేవిధంగా డ్రగ్స్ కి దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.నాటుసారా,గంజాయి లాంటి చెడు వ్యాసనులకు దూరంగా ఉండాలని మీ తల్లిదండ్రులకు అలాగే మీ గ్రామస్తులకు కూడా తెలియజేయాలన్నారు.ముఖ్యంగా విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉంటూ చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని అలాగే ఏ సమస్య ఉన్న స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని తెలియజేశారు.కళాశాల ప్రిన్సిపల్ పి. చలపతిరావు మాట్లాడుతూ,కళాశాలలో ఉన్న ఈగల్ టీం నిరంతరం పర్యవేక్షణ చేస్తుంది కాబట్టి విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకోవాలి అన్నారు. అనంతరం సీఐ కళాశాల ఆవరణలో కళాశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ హిమగిరి

సిజెఐపై దాడిని ఖండించాలి

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి- విఆర్‌పురం : సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై సనాతన పేరుతో దాడి యత్నం చెయ్యడం హేయమైన చర్య అని శుక్రవారం విఆర్‌పురం రాజీవ్‌గాంధీ సెంటర్ నుండి ర్యాలీగా కొనసాగుతూ ముందుగా రేఖపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అక్కడ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం ముందు 20 నిమిషాలు పాటు నిరసన తెలిపారు. తదుపరి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు మాట్లాడుతూ ఇది కేవలం వ్యక్తిపై దాడి కాదు, రాజ్యాంగంపై దాడి' అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు, నాయకులు మండల నాయకులు, మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జస్టిస్ బిఆర్ గవాయిపై దాడిలో ఎమ్మార్పీఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మోర్త బుజ్జి ఆధ్వర్యంలో శుక్రవారం రాజవొమ్మంగిలో మండల అధ్యక్షులు పెద్దాడ నూకరాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలంటూ స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు అర్జున్, వెంకన్నబాబు, నూకరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూనవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ కూనవరం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు కూనవరం పాతబస్టాండ్ నుండి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం అల్లూరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గడ్డం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైన దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మార్పీఎస్ మోదుగు వెంకన్నబాబు, బింగి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీని ప్రదర్శిస్తున్న ఎపి జెన్‌కో అధికారులు

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి -సీలేరు: ఇటీవల జరిగిన ఆల్ ఇండియా కబడ్డీ పోటీల్లో రాష్ట్రవిద్యుత్ ఉద్యోగులు పాల్గొని ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా రాష్ట్రానికి మంచి గుర్తింపు తెచ్చారని ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఇఇ రాజేంద్రప్రసాద్ విద్యుత్ ఉద్యోగ క్రీడాకారులను ప్రశంసించారు. శుక్రవారం స్థానిక (ఐఎన్‌టియుసి) కార్యాలయంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరిరువురూ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆల్ ఇండియా కబడ్డీ పోటీల్లో ఎపి జెన్కో ట్రాన్స్కో డిస్కంలో విద్యుత్ ఉద్యోగులు కబడ్డీలో పాల్గొని తృతీయ స్థానంలో నిలవడం గొప్ప విషయమని కొనియాడారు. కబడ్డీలో చక్కటి ఆటతీరు కనబరిచి ఆంధ్రప్రదేశ్ బెస్ట్ డిఫెండర్‌గా కొండల శ్రీనివాసరావును ఎంపిక చేయడంపై అభినందించారు. ఎపి జెన్కో డిఇఇ శ్రీనివాసులు టీం కెప్టెన్‌గా టీం మేనేజర్‌గా ఎఇ సిహెచ్‌సురేష్ కబడ్డీ టీం సభ్యులకు సూచనలు సలహాలు ఇస్తూ మంచి పాత్ర పోషించారని కొనియాడారు. శామ్యూల్ కూడా మంచి ఆటతీరును ప్రదర్శించాడన్నారు. అనంతరం ట్రోఫీని అధికారులు ప్రదర్శించారు. సహాయ సహకారాలు అందించిన యువతకు జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ రాజేంద్రప్రసాద్ అకౌంట్ ఆఫీసర్ సత్యనారాయణ టీం కెప్టెన్ శ్రీనివాసులు చేతుల మీదగా మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎపి జెన్కో అకౌంట్ ఆఫీసర్ ఇవివి సత్యనారాయణ, ఇంజనీర్లు విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని గోకవరం మండలం జెడ్పిహైస్కూల్ పదో తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సందర్శించారు. హెచ్ఎం పడాల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు విద్యార్థులకు హార్టికల్చర్, అగ్రికల్చర్‌లో తాజా పద్ధతులు, కొత్త రకాల పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్‌స్ట్రక్టర్ విజయ్‌ఆనంద్, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ దుర్గాదేవి, ఫిజికల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, హిందీ స్కూల్ అసిస్టెంట్ రొబ్బి కృష్ణవేణి పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థులు పాల్గొని వ్యవసాయ రంగంపై ఆసక్తి వ్యక్తం చేశారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

విద్యార్థినులను సత్కరించిన అధికారులు

ప్రజాశక్తి -జికెవీధి: మండలంలోని ఐసిడిఎస్ పరిధిలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రింతాడ ఆశ్రమ పాఠశాలలో సమావేశం, ర్యాలీ నిర్వహించడంతో పాటు జికె వీధి నుండి సూపర్ 50కి ఎంపికైన నలుగురు విద్యార్థినులను సత్కరించారు. దీనిలో భాగంగా గూడెం కొత్తవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. ఎంపిడిఒ రమణబాబు, ఎమ్మార్వో అన్నాజీరావు, ఎస్సై సురేష్, గూడెం కొత్తవీధి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పల్లవి, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ డి.వలసమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి యల్.దేవమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలికలకు పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపిడిఒ ప్రసాద్ , హెచ్ఎం సత్యవతి, సిడిపిఒ బహుమతులు అందజేశారు.

రోడ్డు పనులు చేపట్టాలని ధర్నా

ఐటిడిఎ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మండలం డల్లాపల్లి నుంచి హుకుంపేట మండలం చీకుమద్దుల వెళ్ళే తారు రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే మొదలు పెట్టాలని హుకుంపేట మండల వైస్ ఎంపిపి ఎస్.కొండలరావు (సిపిఎం) డిమాండ్ చేశారు. ఎంజిఎన్ఆర్ జిఎస్ పథకంలో రూ.3 కోట్ల వ్యయంతో తారు రోడ్డు మంజూరై మూడేళ్ల అయిందని నేటికీ తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఐటిడిఎ గేటు వద్ద ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు తారు రోడ్డు పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ బైఠాయించి ధర్నా చేశారు. తక్షణమే తారు రోడ్డు పనులు మొదలు పెట్టాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. డల్లపల్లి నుండి గుమ్మడిగుంట మీదుగా చికుమద్దుల వరకు మంజూరైన తారు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి డోలిమోతలు లేకుండా చేయాలన్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారి అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి సినిమా హాల్ సెంటర్ మీదుగా ఐటిడిఎ గేటు వరకు డోలీ మోతలతో ర్యాలీ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనల చోటు చేసుకోకుండా స్థానిక సిఐ డి.దీనబంధు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎల్.సురేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. లోపలకు కొద్ది మందిని మాత్రమే అనుమతించడంతో ఐటిడిఎలోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ ఎస్)లో ఐటిడిఎ పిఒ శ్రీ పూజకు వినతి పత్రం అందించారు. ఐదు రోజుల్లో చర్యలు తీసుకుంటామని పిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్ర మత్స్యరాజు, బొంజన్న దొర, లక్ష్మి ప్రమీల ఉత్తరన్న, సిహెచ్ రాజబాబు, నాగేశ్వరరావు, అప్పలస్వామి, బుజ్జిబాబు, నాగరాజు, కామేశ్వరరావు, ప్రసాద్, ఈశ్వరమ్మ, అప్పలమ్మ, కొండమ్మ, జయకష్ణ, భాస్కర్, ఈశ్వర్, ప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్

సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పదని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం సందర్శించి వీధి కాలువలు, గ్రావిటీ పథకంతో పాటు గ్రామంలోని సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకుని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రావిటీ వీధి దీపాలు మరమ్మతు గురైతే ఎప్పటికప్పుడు మరమ్మత్తు చేసి వినియోగంలో తీసుకురావాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామంలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమి, టిడిపి మాజీ అధ్యక్షుడు టి సుబ్బారావు, ఎంపీటీసీ ఎం గీత, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు ఎం సింహాద్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యుఓ ఉదారత

- రూ. 50 వేలు సొంత నిధులతో హాస్టల్‌లో మరుగుదొడ్ల మరమ్మతులు

ప్రజాశక్తి-అరకులోయ: తమ వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కూడా బాగుండాలని యోచించారు ఇద్దరు గురువులు. సొంత డబ్బులు ఖర్చుపెట్టి మరుగుదొడ్ల మరమత్తు చేసి నీటి సౌకర్యం కల్పించి విద్యార్థుల, వారి తల్లితండ్రుల మన్ననలు పొందారు ఆ ఉపాధ్యాయులు. అరకులోయ మండలంలోని రవ్వలగూడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్ల మంచినీటి సమస్య గత కొద్ది కాలం నుంచి వేధించేది. ప్రస్తుతం చలికాలం కావడంతో విద్యార్థుల ఇబ్బందులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావు, హెచ్ డబ్ల్యుఓ రామ్మూర్తి విద్యార్థుల ఇబ్బందులను దష్టిలో పెట్టుకుని సొంత డబ్బులు రూ. 50వేల రూపాయలు వెచ్చించి మరుగుదొడ్ల మరమ్మత్తు తో పాటు, వాటికి ట్యాప్ లు బిగించి రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించారు. 100 మీటర్ల అంతర్గత పైపులైన్ ద్వారా నీటి ట్యాంకు సౌకర్యం ఏర్పాటు చేసి 24 గంటలు వాటర్ సౌకర్యం ఉండేటట్లు అవసరమైన చర్యలు తీసుకున్నారు. 20 మూత్రవిసర్జన బౌల్స్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. సొంత నిధులతో మరమ్మత్తు చేసి, అన్ని సౌకర్యాలు కల్పించిన ఈ మరుగుదొడ్లను అరకులోయ మండల ఎంఈఓ వి.త్రినాధరావు, ఏ టి డబ్ల్యు ఓ వెంకటరమణ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎంఈఓ, ఎటిడబ్ల్యుఓ

సందర్భంగా ఎంఈఓ, ఏటి డబ్ల్యుఓ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాన్ని గుర్తించి తమ సొంత నిధులతో ఇటువంటి సౌకర్యాలు కల్పించడం పై హెచ్‌ఎం,హెచ్ డబ్ల్యు వో లను అభినందించారు.

గుట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు

- అటవీ శాఖ ప్రొటెక్షన్ వాచర్ ప్రధాన సూత్రధారి అని గ్రామస్తుల ఆరోపణ
- పోలీసులు వెళ్లేసరికి పరారైన నిందితులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పరిధి సత్యవరం, గూనలంక అటవీ ప్రాంతంలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ తవ్వకాల వెనుక అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ చిక్కం జనార్ధన్ కీలక సూత్రధారి అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజులపాటు జనార్ధన్ ఆధ్వర్యంలో పోతురాజుగుమ్మలు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు సత్యవరం అటవీ ప్రాంతంలోని కొండచరియలను తవ్వి రంగురాళ్లను సేకరించినట్లు సమాచారం. సుమారు 15 అడుగుల లోతు వరకు గొయ్యి తవ్వి, మట్టిని తొలగించి రంగురాళ్లను వెలికి తీశారని గ్రామస్తులు తెలిపారు. ఈ తవ్వకాలపై వారిని గ్రామస్తులు ప్రశ్నించగా, జనార్ధన్, అతని బృందం చింతపల్లి అటవీశాఖ అధికారుల అనుమతితోనే తవ్వకాలు చేస్తున్నామని, ఈ ప్రాంతానికి ఎవరూ రావద్దని హెచ్చరించారని గ్రామస్తులు వెల్లడించారు. దీనిపై గ్రామస్తులు గురువారం చింతపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకునేలోపే జనార్ధన్ సహా ఏడుగురు వ్యక్తులు

రంగురాళ్ల తవ్వకాలకు ఆనవాలుగా క్వారీల్లో ఉన్న గోతులు

తమ వద్ద ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలను వదిలేసి పరారయ్యారు. పోలీసులు, అటవీ అధికారులు పరిశీలనలో తవ్వకాల ప్రదేశం గుహలాగా మారిపోయినట్లు గుర్తించారు. అక్కడ మట్టిగోడలు కూలిన పెచ్చులు, రంగురాళ్ల ముక్కలు, చెట్టు వేరు అవశేషాలు, ఖాళీ ప్లాస్టిక్ సంచులు కనిపించాయి. ఈ ఘటన తవ్వకాల పరిమాణాన్ని, జరిపిన పనుల తీవ్రతను చూపిస్తోంది. శుక్రవారం లోతుగడ్డ అటవీ రేంజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, తవ్వకాల గోతులను సిమెంట్, ఇసుక, మట్టి కలిపి పూడ్చివేశారు. తవ్వకాలకు కారణమైన వారిపై విచారణ జరుగుతుందని, నివేదిక సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. అటవీ శాఖలో పనిచేసే వ్యక్తి స్వయంగా అక్రమ తవ్వకాలు చేస్తే, అటవీ రక్షణ ఎలా సాధ్యమవుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టి, నిజమైన నిందితులను వదిలేయడం అన్యాయమని వారు మండిపడుతున్నారు. కేసులు గిరిజనులపై, లాభాలు మాత్రం ప్రొటెక్షన్ సిబ్బందికా, దీని వల్ల అటవీ శాఖపై తమ నమ్మకం కోల్పోయామని గ్రామస్తులు పేర్కొన్నారు. జనార్ధన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-చింతపల్లి : దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయం చేపట్టే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ బాబు అన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా విక్రయం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సీఐ సూచించారు. బాణసంచా వ్యాపారులు ముందుగానే అనుమతులు పొందితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా చట్టబద్ధంగా విక్రయాలు జరుపుకోవచ్చని స్పష్టం చేశారు.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

- పిజిఆర్‌ఎస్‌కు 186 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి 186 వినతులు వచ్చాయి. ఇన్చార్జి జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, డిఆర్ఒ కె.పద్మలత, టిడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

హుకుంపేట మండలం భీమవరం పంచాయతీ గుమండు గండుకు చెందిన ఎన్.సన్నిబాబు గ్రామంలో రోడ్డు మంజూరు కోరుతూ వినతి సమర్పించారు. పెదబయలు మండలం కుంతర్ల పంచాయతీ బోడ్డాపుట్టుకు చెందిన ఎం.బాబుజీ గ్రామంలో రోడ్డు నిర్మాణం, బొంగరం పంచాయతీ వంజుర్భలో జలజీవన్ మిషన్ ద్వారా మంచి నీటి సౌకర్యం కల్పించాలని వినతిని అందించారు. అనంతగిరి మండలం కొండిబ పంచాయతీ కొండిబ గ్రామస్తురాలు కె.సత్యవతి వితంతు పింఛను మంజూరు కోరుతూ వినతి అందించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి పిబికె పరిమళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ, డ్వామా పిడి విద్యాసాగర్, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, సివిల్ సప్లై డియం వి.మోహన్, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్ పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : పర్యాటక ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య, సామాజిక సేవలు అందించాలనే లక్ష్యంతో పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో రాజుబంధ గ్రామంలో నిర్మించిన బహుళ ప్రయోజన భవనం శుక్రవారం ప్రారంభమైంది. ప్రధానమంత్రి జన్‌మాన్ పథకం కింద రూ.60 లక్షల వ్యయంతో మల్టీపర్పస్ సెంటర్‌ను నిర్మించారు. లమ్మసింగి పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతికుమారి దీనిని ప్రారంభించారు. ఈ భవనంలో ప్రజా సమావేశాలు, వైద్య శిబిరాలు, శిశు ఆరోగ్య కార్యక్రమాలు, మహిళా సంఘాల చర్చలు, ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు వంటి అనేక సేవలు నిర్వహించేందుకు అనువుగా సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి, అంగన్వాడీ కార్యకర్త కొర్ర వరహాలమ్మ, మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేపూరు గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, పీసా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు సూర్ల కళ్యాణం, నాగరాజు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి గ్రామపంచాయతీ కొక్కిరపల్లి గ్రామంలో అంగన్వాడి నూతన భవనాన్ని శుక్రవారం జడ్పిటిసి మత్స్యరాస వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ సురబంగి రామకృష్ణ ప్రారంభించారు. నూతన భవనం ప్రారంభంతో అంగనవాడికి వచ్చే చిన్నారుల కష్టాలు తీరాయని హర్షం వ్యక్తం చేశారు సిడిపిఒ సిహెచ్ బాలామణి, సూపర్వైజర్ ఉమ, ఎఇఇ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విజయభారతికి నేషనల్ స్పోర్ట్స్ లీడర్ షిప్ అవార్డు

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతికి నేషనల్ స్పోర్ట్స్ లీడర్ షిప్ అవార్డు - 2025 లభించింది. ఫిజికల్ ఫిట్నెస్ టెస్టింగ్ ఇన్ జపాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో జరిగింది. మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ జాతీయ స్థాయి అవార్డు లభించడం పట్ల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ప్రజాశక్తి - రంపచోడవరం : సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలక మని ఎస్ఐ డి.భూషణం అన్నారు. అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యం లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో నిర్వహించిన మూడు నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణను పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు (ఆఫర్ లెటర్లు) రంపచోడవరం ఎస్ఐ భూషణం అందజేశారు. అంబుజా ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, అన్ని రంగాల్లో యువతకు మార్గదర్శకంగా నిలిచేలా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే బ్యాచ్‌లకు కూడా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని సెంట్రల్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న జనసేన అధ్యక్షులు ఈశ్వరరావు తదితరులు

15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై వినతి

ప్రజాశక్తి- జీకే వీధి: మండలంలోని సంకాడ పంచాయతీ పరిధిలో గత నెల పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘ నిధుల దుర్వినియోగంపై పంచాయతీ అధికారులు ప్రజా ప్రతినిధులు ఖర్చు వివరాలు చూపించాలని రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగయ్య, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సంకాడ పంచాయతి జనసేన అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు సమర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి మార్కెట్ డైరెక్టర్ కృష్ణమూర్తి , జనసేన నాయకులు రాజబాబు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పంట కోత ప్రయోగాలపై శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ ఉద్యానవన సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయాధికారి చక్రధర్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా ఎటువంటి తప్పులు లేకుండా చెయ్యాలన్నారు. పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ శాఖ జివిఎ ఆధారపడి ఉందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడి, బీమా, పంట కోత ప్రయోగాల ఆధారంగానే వస్తాయని తెలిపారు. ఎఎస్ఒ చైతన్య మాట్లాడుతూ ప్లాట్ ఎంపిక, పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలి, ఎపిపి ఎలా చెయ్యాలి వంటి విషయాలపై శిక్షణ కల్పించారు.

కొమరవరంలో 'డ్రైడే-ఫ్రైడే'

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలోని తామరపల్లి పంచాయతీ కొమరవరంలో 'డ్రై డే-ఫ్రైడే' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముసురుమిల్లి ఎంపిటిసి సభ్యుడు వంశీ కుంజం పాల్గొని గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, డ్రెయినేజీలో నిల్వ నీటిపై యాంటీ లార్వా మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వంశి కుంజం మాట్లాడుతూ గ్రామంలో నీటి సరఫరా సమస్యలపై గ్రామస్తులు తెలిపిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరి ష్కారం కల్పించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ సుహాసిని, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి - రంపచోడవరం: పిహెచ్‌సి వైద్యుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రంపచోడవరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పల్లపు వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పిహెచ్‌సి వైద్యాధికారులు తమ డిమాండ్ల సాధనకు విజయవాడ ధర్నా చౌక్ వద్ద గత 12 రోజులుగా ధర్నా చేస్తున్నారన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నప్పటికీ వైద్య అధికారులకు న్యాయం చేసే నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. వైద్య అధికారుల భవిష్యత్తుకు ఖచ్చితమైన భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాలో తగ్గించారని, ఏజెన్సీ అలవెన్స్ ఇవ్వడంలేదని, టైం బాండ్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యుల డిమాండ్లు తక్షణమే పరిష్కారం చూపాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉన్నత అధికారులు తక్షణమే వైద్యాధికారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నిర్మల, వెంకట రామలక్ష్మి, ఉపాధ్యక్షులు సిహెచ్ రాంబాబు, లక్ష్మణ్, కె, శాంతిరాజు, కె.రాణి, లక్ష్మి, బేబీ రాణి, ఎస్. రాజేశ్వరి, పాయం సీతారామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

రాజవొమ్మంగి: రాష్ట్రవ్యాప్తంగా ఎపి పిహెచ్‌సి డిఎ ఆధ్వర్యంలో జరుగుతున్న 13వ రిలే నిరాహార దీక్షకు రోజురోజుకీ ప్రజాసంఘాలు, వైద్యసంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్, వైద్యులు అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు, ఏజెన్సీ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న వైద్యులకు అన్ని పీహెచ్‌సీల యూనియన్ సంఘాలు, అసోసియేషన్లు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. శుక్రవారం మండలంలోని జడ్డంగి పిహెచ్‌సి వైద్యసిబ్బంది మద్దతు ప్రకటించారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం స్పందించి, సముచిత పరిష్కారం చూపాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు ప్రమీల, హెచ్‌విలక్ష్మి, స్టాఫ్‌నర్స్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలోవిభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోవరిలో చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శివశ్రీనివాస్ తెలిపారు . క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని వరి పొలాలను పరిశీలించి తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను సూచించారు. కాండం తొలిచే పురుగు వలన మొవ్వు పడిపోవడం, ఉల్లికోడు, సుడిదోమ వంటి పురుగులను గుర్తించి నట్లయితే నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలి. ఎర్రనల్లిని గమనిస్తే ప్రొఫెనోఫాస్ లేదా సల్ఫర్ వంటి మందులను పిచికారి చేసుకోవాలన్నారు. మాగుడు తెగులును గమనిస్తే పొలంలోనూ, గట్ల మీద కలుపు లేకుండా చూసుకుని హెక్సా కొనోజోల్ అనే మందును లీటర్ నీటికి రెండు మిల్లి లీటర్లు కలుపుకుని పిచికారి చేసుకోవాలన్నారు. ఎండాకు తెగులు గమనించినట్లయితే నత్రజని ఎరువులు వేయడం నిలిపివేయాలన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి శివశ్రీనివాస్

బలహీన వర్గాల అభ్యున్నతికి సూపర్ జిఎస్‌టి

ప్రజాశక్తి -రంపచోడవరం : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమం ద్వారా వివిధ వస్తువులపై పన్నులు భారీగా తగ్గించబడ్డాయని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన మహిళా సంఘ సభ్యులు, వర్తక సంఘ ప్రతినిధులు, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు వివిధ శాఖల అధికారులతో కలిసి సూపర్ జిఎస్‌టి అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పథకం అమలుతో సాధారణ ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభించిందన్నారు. నిత్యవసర వస్తువులపై 0 నుంచి 5 శాతం వరకు పన్ను తగ్గింపులు అమలులోకి వచ్చాయన్నారు. జీఎస్టీ గురించి బుర్రకథ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జనరల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

డి.ఎన్.వి. రమణ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రామమోహన్‌రావు, ఎంపిడిఒ వై.రాజబాబు, ఎఒ పి. జయంతి, డిప్యూటీ తహశీల్దార్ స్వామి మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, వర్తక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇ - పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలో ఉన్న రైతులంతా ఈ నెల 25 వ తేదీలోపు ఇ పంట నమోదు పూర్తి చేయించాలని వ్యవసాయాధికారి దేవి సూచించారు. రైతులు తాము వేసిన పంటల వివరాలను పంట నమోదులో వుండేలా రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. శుక్రవారం కొండ్రాజుపేట, శభరి కొత్తగూడెం గ్రామాల్లో పంట నమోదు రికార్డులను మండల వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

465 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక గురుకుల పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి పర్యవేక్షణలో గోకవరం ఆదిత్య మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి 465 మంది విద్యార్థినిలకు డాక్టర్ ఎండి షేక్ సల్మాన్‌షరీఫ్, డాక్టర్ కె.జార్జ్‌మిల్లర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ, స్క్రీనింగ్‌పరీక్షలు చేపట్టారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి రబ్బర్ సొసైటీ ఆఫీసు వద్ద సెంటర్ ఫర్ ట్రైబల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఫౌండేషన్ ఫర్ (ఎంఎస్ఎంఈ) క్లస్టర్స్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ రిజిస్ట్రేషన్ సభ్యులకు సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా క్లస్టర్స్ సీనియర్ మేనేజర్ ఎం.వి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ క్రైమ్ పెరిగిపోయినందున కేసులు అత్యధికంగా నమోదయ్యాయని బ్యాంక్ యజమాని,లేదా పోలీసు అని ఓటిపి చెప్పడం ద్వారా లేదా హాక్ చేసి అకౌంట్‌లో ఉన్న డబ్బు వారికి జమ అవుతోందన్నారు. పోలీస్ వారికి ఫిర్యాదు చేసినా ఆధారాలు లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ స్టేట్ కో ఆర్డినేటర్ షేక్ అబ్దుల్ ముజీబ్, ప్రోగ్రామ్ సిటిఆర్ సంస్థ అధ్యక్షులు డా.రాజ్‌కుమార్ రెడ్డి పల్లాల, కో ఆర్డినేటర్ శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కోడా ఒక్టవి ఆర్ఎస్ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడాకు చెందిన స్కోడా ఒక్టవి ఆర్ఎస్ ఫ్రీ బుకింగ్స్ శుక్రవారం నుండి విశాఖలో ప్రారంభమయ్యాయని సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్‌గుప్తా తెలిపారు. శుక్రవారం విశాఖలోని స్కోడా షోరూంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో స్కోడా 25 ఏళ్ల సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ వాహనాన్ని విడుదల చేస్తున్నామని ఈ మోడల్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని ఆయన అన్నారు. ఈ వాహనం డెలివరీ నవంబర్ 6 నుండి ప్రారంభమవు తాయని ఈ వాహనం యొక్క ప్రారంభ ధర రూ. 49,99,000గా ఉందని ఆయన తెలిపారు.